మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి-విజయనగరం

మాదక ద్రవ్యాలకు యువత బానిస కావద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మాదకద్రవ్యాలపై ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. తిరుమల నర్సింగ్ హోం నుంచి మయూరి జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని, వారి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాలు సేవించడం, వాటిని రవాణా చేస్తే అతి కఠినమైన శిక్షలు ఉంటాయని యువతను హెచ్చరించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల యువత ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలకు విషాదాన్ని మిగులుస్తున్నారని తెలిపారు. యువత తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ, ఎస్ఐ, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తిరుమల నర్సింగ్ హోం, ఆదిత్య, నారాయణ కళాశాలల విద్యార్థులు, ఇస్కాఫ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వే ముగిసి, పాస్ పుస్తకం చేతికొచ్చింది. ఓ రైతు అవసరాల నిమిత్తం కొంత పొలాన్ని అమ్మాలని అనుకున్నారు. ముందస్తుగా అడ్వాన్సులు తీసుకుని అమ్మకపు ఒప్పందాలు చేసుకున్నారు. నిర్ణీత సమయానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే.. మీ గ్రామానికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు కావడం లేదని సిబ్బంది సెలవిచ్చారు. దీనికి పరిష్కారం ఏమిటనే అడిగితే, సరైన స్పందన లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో రుణం రెన్యువల్ కోసం వెళ్లిన మరో రైతుది అదే పరిస్థితి. ఈ సమస్య కేవలం ఒకరిద్దరు రైతులది కాదు. జిల్లా వ్యాప్తంగా రీసర్వే చేపట్టిన గ్రామాల్లోని అందరి రైతులది ఇదే పరిస్థితి. రీ సర్వే గ్రామాల్లో వన్‌బిలు రాకపోవడంతో బ్యాంకు లోన్లు రెన్యువల్ చేయలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక రైతులు అగచాట్లు పడుతున్నారు.


స్థలం రిజిస్ట్రేషన్ కాకపోవడంతో కామన్నవలస వద్ద అర్ధాంతరంగా నిలిచిన పెట్రోల్ బంకు నిర్మాణ పనులు

రిజిస్ట్రేషన్లకు రీసర్వే గ్రహణం

- సమగ్ర భూసర్వేలో మారిన కొలతలు, రికార్డులు
- వెబ్‌ల్యాండ్‌లో చూపని వన్‌బి, అడంగల్ వివరాలు
- బ్యాంకు రుణాల రెన్యువల్, రిజిస్ట్రేషన్ల కోసం రైతుల అగచాట్లు

ప్రజాశక్తి-బాడంగి

భూ సమస్యల పరిష్కారం పేరిట వైసిపి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమం రైతుకు కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. కొత్తగా చేసిన సర్వేలో కొందరు రైతుల భూ విస్తీర్ణం కొలతలు తారుమారు కావడంతో అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో ఆ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకుండా అధికారులు పెండింగ్‌లో ఉంచారు. ఫలితంగా భూముల రిజిస్ట్రేషన్, రుణాల రీషెడ్యూల్‌కు వెళ్లాలంటే తమ రికార్డులు కనిపించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా మరోసారి ఆ భూములను రీసర్వే చేస్తే తప్ప సమస్యను పరిష్కరించలేమని చావుకబురు చల్లగా చెబుతున్నారు. దీంతో జిల్లాలో రీసర్వే చేపట్టిన గ్రామాల్లో వన్‌బిలు రాకపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. తమ భూములకు సంబంధించి రుణాల రీషెడ్యూల్ పరిస్థితి ఏమిటో అర్థంగాక రైతులు రీసర్వే తెచ్చిన తిప్పలపై మండిపడుతున్నారు.

సర్వే నంబర్ కాదు.. ఎల్‌పి నంబర్

బ్రిటిష్ కాలం నుంచి అందుబాటులో ఉన్న సర్వే నంబర్ల విధానాన్ని మార్పుచేసి ఎల్‌పి నంబర్ విధానం అందుబాటులోకి తెచ్చారు. అదే ముఖ్య ఉద్దేశంగా సమగ్ర భూసర్వేను గత వైసిపి ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా సర్వే ప్రక్రియను డ్రోన్, ఏరియల్ సర్వే ద్వారా చేపట్టింది. ఈ రెండు సర్వేలూ చేయలేని ప్రాంతంలో డిజిపిఎస్ సర్వే ద్వారా భూముల విస్తీర్ణాన్ని కొలిచింది. జిల్లాలో రామభద్రపురం, బొండపల్లి మండలాల్లోని రెండు గ్రామాలను తొలుత ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి, రీసర్వే చేశారు. అనంతరం బాడంగి మండలాన్ని ఎంపిక చేసిన 25 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తిచేశారు. వెబ్‌ల్యాండ్‌లో ఎల్‌పి నంబర్ల కింద రికార్డులు నమోదు చేశారు.

కొలతల్లో, రికార్డుల్లో మార్పులు

రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో భూములకు సంబంధించిన రికార్డుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. కొందరు రైతుల భూ విస్తీర్ణం తక్కువగా, మరికొందరి భూ విస్తీర్ణం ఎక్కువగా చూపారు. దీంతో తమ భూ విస్తీర్ణం సరిగా చూపాలని రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అలాంటి భూముల వివరాలను అధికారులు వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించకుండా పెండింగ్‌లో పెట్టారు. దీంతో రుణాల రీషెడ్యూల్‌కు వెళ్లాలంటే భూమికి సంబంధించని వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదు. బ్యాంకుల్లో రుణాలు రీషెడ్యూల్ చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

భూముల క్రయవిక్రయాల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లినా రిజిస్ట్రేషన్ కావడం లేదు. వన్‌బిలు రాకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయలేమని అక్కడి అధికారులు చెబుతున్నారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో భూములు అమ్ముకోవాలని చూసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూములు కొనుగోలు చేయడానికి అడ్వాన్సులు ఇచ్చిన వారు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సుమారు ఏడాదిన్నర కాలం నుంచి ఇదే సమస్య ఎదురవుతోంది. అయితే అధికారులు మాత్రం వారి సమస్య పరిష్కారం కావాలంటే పెండింగ్ ఉన్న రీసర్వే పూర్తి కావాల్సిందేనని తేల్చిచెబుతున్నారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం



నాకు ముగ్గురు ఆడపిల్లలు. పెళ్లిళ్లు కూడా చేశాను. మాకు సుమారు మూడు ఎకరాల భూమి ఉంది. అయితే అప్పులు ఎక్కువగా ఉండటం వల్ల భూమి విక్రయించాలని చూస్తే, రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలిసింది. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేకపోతున్నాను.

- వెంపడాపు రామిశెట్టి, ఆకులకట్ట, బాడంగి మండలం

వన్‌బి రాక ఆగిన పనులు



2023 ఆగస్టులో కామన్నవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 33-7లో భూమి కొనుగోలు చేశాను. వన్‌బి రాకపోవడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. ఆ స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటుచేయాలని చూస్తున్నాం. రీసర్వే వల్ల వన్‌బి రాకపోవడంతో పనులన్నీ నిలిచిపోయాయి.

- పాలవలస గౌరు, ఎంపిటిసి, గజరాయునివలస



కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న సమతా కన్వీనర్ జి.నిర్మల

ఆలోచింపజేసి.. చైతన్యాన్ని నింపి

ఆకట్టుకున్న ఉత్తరాంధ్ర సమతా కన్వెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల సమతా (మహిళా విభాగం) కన్వెన్షన్ అందరినీ ఆలోచింపజేసింది. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కన్వెన్షన్ వారిలో చైతన్యాన్ని నింపింది. సమాజంలో మహిళలపై మూఢవిశ్వాసాల ప్రభావం, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన కన్వెన్షన్ ఆద్యంతం ఆకట్టుకుంది. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం ఈ కన్వెన్షన్ ఏర్పాటుచేశారు. సమతా కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో స్త్రీ ప్రసూతి వైద్యులు బిందు, శ్రావణి... 'స్త్రీల ఆరోగ్యం -ఆహారపు అలవాట్లు' అనే అంశంపై అవగాహన కల్పించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గుంజన్ సింగ్.. 'మహిళా సాధికారిత'పై ప్రసంగించారు. సమతా జిల్లా అధ్యక్షులు సుశీల అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో 'మహిళా చైతన్యం -శాస్త్రీయ దృక్పథం' అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పి.రమణ ప్రభాత్ అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన రెండో సెమినార్లో జిల్లా సమతా నాయకులు చిన్నారి 'ఆధునిక మహిళ ఏమి ఆలోచించాలి' అనే అంశంపై మాట్లాడారు.

అనంతరం మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకొని మేజిక్ సహాయంతో కొందరు ప్రజలను ఎలా మోసగిస్తారో ప్రముఖ మేజిషియన్ శ్యామ్.. కొన్ని అంశాల సాయంతో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ వి.మోహన్ సారథ్యంలో, డప్పు శ్రీను సహకారంతో అభ్యుదయ గీతాలు ఆలపించారు.

జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్, త్రిమూర్తులు రెడ్డి, రాజగోపాల్ పర్యవేక్షణలో జరిగిన ఈ కన్వెన్షన్‌లో జిల్లా నాయకులు ఎంవిఎన్ వెంకటరావు, చీకటి దివాకర్, శశిధర్, సింహాచలం, ఆదినారాయణ పాల్గొన్నారు.


అభ్యుదయ గేయాలాపన చేస్తున్న సాంస్కృతిక విభాగం సభ్యులు

సిఐల బదిలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని 17 మంది సిఐలకు బదిలీ అయింది. ఈ మేరకు విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ శెట్టి ఉత్తర్వులు విడుదల చేశారు. బదిలీ అయిన సిఐల వివరాలు...

సిఐ పేరు	బదిలీ స్థానం
కె.నారాయణరావు	బొబ్బిలిరూరల్
కె.రవికుమార్	శృంగవరపుకోట
వి.నారాయణమూర్తి	శృంగవరపుకోట (యుపిఎస్)
హెచ్.ఉపేంద్రరావు	రాజాంరూరల్
ఎస్.శ్రీనివాస్	విజయనగరం వన్‌టౌన్
టి.శ్రీనివాసరావు	విజయనగరం టుటౌన్
సూరినాయుడు	విజయనగరం ట్రాఫిక్
సిహెచ్ షణ్ముఖరావు	కొత్తవలస
జి.రామకృష్ణ	భోగాపురం
జి.ఎ.వి.రమణ	గజపతినగరం
బి.వెంకటరావు	విఆర్ (విశాఖ)
పి.రంగనాథం	విఆర్ (విశాఖ)
వై.మురళీరావు	విఆర్ (విశాఖ)
వి.చంద్రశేఖర్	విఆర్ (విశాఖ)
బివి.వెంకటేశ్వరరావు	విఆర్ (విశాఖ)
కె.రామారావు	విఆర్ (విశాఖ)
ఎన్.వి.ప్రభాకరరావు	విఆర్(విశాఖ)

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, సమస్యలు సృష్టిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్‌పి ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా శనివారం దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా లే-అవుట్లు, శివారు ప్రాంతాల్లో, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 171మంది మందుబాబులపై కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలను కొనసాగించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదుచేశారు. మద్యం తరలింపు-2, పశువుల అక్రమ రవాణా-2 కేసులు నమోదు చేశారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి, 22 పశువులను, రెండు వ్యాన్లను సీజ్ చేశారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 43 బాటిళ్లను సీజ్ చేశారు. పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి, కేసు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు మద్యం సేవించి వాహనాలను నడిపిన వారిపై 15 కేసులు, ఎం.వి నిబంధనలు ఉల్లంఘించిన 366 మంది వాహనదారులకు రూ.87,660 ఇ-చలానాలను విధించినట్లు ఎస్‌పి వెల్లడించారు.


బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వరద బాధితులకు విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-కొత్తవలస

కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం సిపిఎం ఆధ్వర్యాన కొత్తవలసలో ఆదివారం సహాయనిధి సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ వయనాడ్‌లో వరద బీభత్సంతో వందలాది మంది మరణించారని, వేలాది సంఖ్యలో నిలువ నీడ లేకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ నష్టాన్ని ఎవరూ పూడ్చలేమని, కానీ మానవతా దృక్పథంతో సహాయం అందించాలని కోరారు. అందుకే సహాయనిధి సేకరిస్తున్నట్లు తెలిపారు. రూ.1930 విరాళాలు సేకరించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, సోములు, తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టర్ల సదస్సుకు అంబేద్కర్

విజయనగరంకోట : ఈ నెల 5,6 తేదీల్లో అమరావతిలో సచివాలయంలో జరిగే కలెక్టర్ల సదస్సుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదివారం బయల్దేరారు. సమర్థవంతమైన పాలన అందించడం, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సిఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.

ముగిసిన చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని గురజాడ పాఠశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-7 చెస్ పోటీలు విజయవంతం అయ్యాయి. బాలికల విభాగంలో ఎఎన్‌ఎస్ఎస్ కావ్య (గుంటూరు), ఎ.వేదష్వి (తూర్పుగోదావరి) ప్రథమ, ద్వితీయ బహుమతి స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో ఎ.శశాంక్ (పశ్చిమగోదావరి), ఎ.మజ్నాస్ (పల్నాడు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మైసూర్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్ -7 పోటీలలో వీరు రాష్ట్రం తరపున పాల్గొంటారు. విజేతలకు పంచాయతీరాజ్ మన్యం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఇ ఎం.వి.ఆర్.కృష్ణాజీ, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు, వైస్ ప్రెసిడెంట్ మస్తాన్ బాబు బహుమతులు అందజేశారు. రాజీవ్, అర్చన, ధనలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. టోర్నమెంట్ డైరక్టర్ కె.వి.జ్వాలాముఖి, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీలతో విజేతలు

రూ.11,278 కోట్లతో వార్షిక ప్రణాళిక


- ప్రాధాన్యతా రంగాలకు రూ.9171.46 కోట్లు
- ఇందులో వ్యవసాయ రంగానికి రూ.7141.61కోట్లు
- ప్రాధాన్యేతర రంగాలకు రూ.2107.05 కోట్లు
- ఈ ఏడాది కౌలురైతులకు రూ.70 కోట్ల రుణసాయం
- 'ప్రజాశక్తి'తో ఎల్‌డిఎం వివి రమణమూర్తి ముఖాముఖి

ఈ ఏడాది రూ.11,278 కోట్లతో వార్షిక ప్రణాళిక రూపొందించామని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వి.వి.రమణమూర్తి తెలిపారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.9171.46 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2107.05 కోట్లు చొప్పున కేటాయించినట్టు వివరించారు. ప్రాధాన్యతా రంగంలో భాగంగా వ్యవసాయ రంగానికి రూ.7141.61 కోట్లు కేటాయించామని చెప్పారు. పంట రుణాలు, యాంత్రీకరణ, ఎంఎస్ఎంఇ, గృహ నిర్మాణం, బలహీన వర్గాల వారికి ఉపాధి కల్పన వంటి వాటికి గతంతో పోలిస్తే రుణ సాయం పెరుగుతుందని వెల్లడించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లాలో కౌలుదారులకు రూ.70 కోట్లకు తగ్గకుండా రుణసాయం అందించేందుకు సంకల్పించామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది రుణ ప్రణాళిక ఏ విధంగా ఉంది.?

వార్షిక రుణ ప్రణాళిక గతంతో పోలిస్తే బాగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.9,065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించాం. ఇందులో ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు చొప్పున కేటాయించాం. ఈ ఏడాది ప్రాధాన్యతా రంగాలకు రూ.9171.46 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2107.05 కోట్లు చొప్పున కేటాయించాం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7509 కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించి లక్ష్యానికి మించి రూ.7,975 కోట్ల (106.1 శాతం) మేర రుణాలు అందజేశాం. గడిచిన రెండేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ప్రణాళిక రూపొందించాం.



వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత.?

మొత్తం కేటాయింపులో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. మొత్తంగా గతేడాది రూ.5,823 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.7141.61 కోట్లు కేటాయించాం. ఇందులో పంట రుణాలకే అత్యధికంగా రూ.4,490.56 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. గత ఏడాది సుమారు 3.10లక్షల మందికి రూ.3432 కోట్ల మేర రుణాలు కల్పించగా, ఈ ఏడాది రూ.3,621.69 రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.2,037.07 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తం నుంచి దీర్ఘకాలిక రుణాలు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ గిడ్డంగులు, వాటర్‌షెడ్, బయోగ్యాస్ వంటి రూపాల్లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, అగ్రి క్లీనిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్స్, అగ్రి సొసైటీలు, మైక్రో ఫైనాన్స్ తదితరాలకు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇతర ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు ఎలా ఉన్నాయి.?

వ్యవసాయ రుణాలతోపాటు స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్నపరిశ్రమల ఏర్పాటు తదితరాలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతా రంగాలుగా భావిస్తోంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.1500.49 కోట్లు కేటాయింపులు ఉన్నాయి. వీటికి గత ఏడాది కేవలం రూ.1,211 కోట్లు మాత్రమే కేటాయించాం.



రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు దాటిన హౌసింగ్, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్స్ తదితరాలు ప్రాధాన్యేతర రంగాల్లోకి వస్తాయి. వీటికి గతేడాది రూ.1,590 కోట్లు కేటాయించాం. ఈ ఏడాది కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం ఎడ్యుకేషన్ లోన్లకు రూ.57.79 కోట్లు, హౌసింగ్ రుణాలకు రూ.265.83 కోట్ల చొప్పున కేటాయింపులు ఉన్నాయి.

కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉందా.?

కౌలురైతులు కూడా తప్పకుండా బ్యాంకు ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంది. కౌలురైతులకు సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు)లను రెవెన్యూ అధికారులు జారీచేస్తున్నారు. వీటి ఆధారంగా బ్యాంకులో పంట రుణాలు పొందేందుకు సౌలభ్యం ఉంది. జిల్లాలో 12 వేల మంది కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. వీరంతా సిసిఆర్‌సిలతోపాటు తాము సాగుచేస్తున్న భూమి యజమానుల నుంచి నిరభ్యంతర రుణాలు పొందవచ్చు. ఈ ఏడాది రూ.70 కోట్ల మేర రుణసాయం అందించాలని ఇటీవల జరిగిన సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో నిర్ణయించాం.

గోకులం పథకానికి పచ్చజెండా

పశుపోషకులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. గోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు అవకాశం కల్పించనుంది. ఈ మేరకు పశు సంవర్ధకశాఖధికారులకు ఉత్తర్వులు అందాయి. అందులో మార్గదర్శకాలను కూడా పొందుపరచడంతో అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. గతంలో కూడా టిడిపి హయాంలోనే ఈ పథకాన్ని తీసుకొచ్చారు. అప్పట్లో ఈ పథకం కింద లబ్ధిదారులు వందలాది షెడ్లు నిర్మించారు. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం వీటికి మంగళం పాడింది. నిర్మాణాలు పెండింగ్‌లో ఉండిపోయి రాయితీ, బిల్లులు చెల్లించేందుకు రైతులను నానా ఇబ్బందులకు గురిచేసింది. మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని పునరుద్ధరించింది. దీంతో రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తుంది.

- విధి విధానాలు ఖరారు
- దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం



గతంలో నిర్మించిన గోవుల షెడ్డు

ప్రజాశక్తి- రామభద్రపురం


గోకులం పథకంలో పాడి పశువులతో పాటు కోళ్ళు, మేకలు, గొర్రెలకు కూడా షెడ్లు నిర్మించుకునే అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. గొర్రెలు, మేకలకు సంబంధించి 30 శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. పాడిరైతులకు మాత్రం 90 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుండగా కేవలం 10 శాతం మాత్రమే రైతులు చెల్లిస్తే సరిపోతుంది. షెడ్లు నిర్మాణాలు కనీసం 10 నుంచి 15 ఏళ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఉపాధి పథకంలో భాగంగా నిధుల చెల్లింపుతో పాటు పనులు జరగనున్నాయి. ఈ మేరకు సొంత భూమి/ఇంటి స్థలం ఉండే వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఎస్‌సి, ఎస్‌టి సంచారజాతులు, డీనోటిఫైడ్ గిరిజన మహిళలకు బృందాలుగా అవకాశాలు కల్పిస్తారు. లబ్ధిదారులు సన్న, చిన్నకారు రైతులై ఉండాలి. ఉపాధి హామీ జాబ్ కార్డు తప్పనిసరి.

నిర్మాణాలకు సంబంధించి నిధులు

రెండు పశువులు ఉండే షెడ్ నిర్మాణానికి యూనిట్ విలువ రూ.1.15లక్షలు కాగా, రాయితీ లక్షా 3వేల 500లు, దీనిలో రైతు11,500 చెల్లించాలి. 4 పశువుల ఉండే షెడ్ యూనిట్ 1.85లక్షలు, రాయితీ లక్షా 66 వేల 500, రైతు 18,500 చెల్లించాలి. అదే 6 పశువులు దాటిన షెడ్ యూనిట్ విలువ రూ.2.30లక్షలు కాగా దీనికి రాయితీ రెండు లక్షల 7 వేల 500, రైతు 23 వేలు చెల్లించాలి. గొర్రె, మేక, కోళ్ళు షెడ్ నిర్మాణాలకు 200 దాటి ఉన్న సంపదకు యూనిట్ వ్యయం రూ.1.32 లక్షలు కాగా రూ.92వేలు రాయితీ పోగా రూ.39 వేల 600 చెల్లించాలి. 200 లోపు కోళ్ళు, గొర్రెలు, మేకలు ఉన్న వారు కూడా షెడ్ నిర్మాణాలకు అర్హులవుతారు. ఆయా యూనిట్ వ్యయాన్ని అనుసరించి రాయితీ పోగా మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. గోకులం పేరిట షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి ఇటీవలే ఉత్తర్వులు అందాయని అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియకు మండల స్థాయి అధికారులకు అప్పగించామని జెడి వైవి రమణ తెలిపారు. నిర్మాణ పనులు మాత్రం ఉపాధి హామీ పథకంలోని ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతా యన్నారు. అన్నీ సక్రమంగా జరిగితే పాడి రైతులు మరిన్ని పశువుల పోషణకు శ్రద్ధ చూపే అవకాశం ఉంది. మేక, గొర్రె, కోళ్ళు పెంపకం దారులకు ఆ రంగం లాభ సాటిగా మారే అవకాశం ఉంటుందని ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ జిల్లాల్లోని పశుసంపద

విజయనగరం జిల్లాలో ఆవులు 3,77,960, గేదెలు 97,845, గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511, కోళ్ళు 51,26,764 ఉన్నాయి. మన్యం జిల్లాలో ఆవులు 2,28,681, గేదెలు 46,017, గొర్రెలు 2,07,451, మేకలు 1,73,110, కోళ్ళు 8,46,060 ఉన్నట్లు పశుసంవర్ధక శాఖాధికారులు తెలిపారు.



విజయవాడ సమావేశానికి హాజరైన మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు

త్రీమెన్ కమిటీలో సుజయ్‌కృష్ణకు చోటు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావుకు చోటు దక్కింది. విజయవాడలోని ఒక హోటల్లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్ష శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి గోపినాథ్‌తో పాటు ఇతర సభ్యులు రాజీనామాలు సమర్పించారు. వెంటనే త్రీమెన్ కమిటీని అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు ఈ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనతో పాటు అనంతపురానికి చెందిన మాంచస్, గుంటూరుకి చెందిన మురళి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగేంత వరకు త్రీమెన్ కమిటీ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహణ బాధ్యతలు కొనసాగిస్తుందని తెలిపారు.



కాలువలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

రైతుల శ్రమదానం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఓని అగ్రహారం తంపర గెడ్డ పిచ్చి మొక్కలు, చెత్త చెదారాలతో నిండిపోవడంతో నీరు నిల్వ ఉండి పంటల సాగుకు ఆటంకం కలుగుతోంది. దీంతో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ రైతులు అంతా కలిసి శ్రమదానం చేసి తంపర గెడ్డలో ఉన్న పిచ్చి మొక్కలను పూడికలను ఆదివారం తొలగించి శుభ్రం చేశారు

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

స్నేహితుల దినోత్సవం సందర్భంగా గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటేందుకు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి, సభ్యులు కె.కృష్ణదాసు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి పంచాయతీ పరిధిలో గల బొర్రా వలస గిరిజన గ్రామంలో తాగునీటి బోరు బావి చుట్టూ మురుగు పేరుకుపోయింది. మారిక కొండ నుంచి వచ్చే వర్షపు ఊటనీరు తాగునీటి బోరు బావి చుట్టూ చేరి నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వెదజల్లుతూ ఈగలు, దోమలు, వల్ల ఇబ్బందిగా ఉందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి బోరుబావి చుట్టూ ఉన్న మురుగు నీరు ఎప్పటికప్పుడు పోయే విధంగా తగు చర్యలు చేపట్టి రోగాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.




బోరు చుట్టూ చేరిన మురుగు

సొంత నిధులతో డ్రెయినేజీ పలకలు ఏర్పాటు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రం వల్లంపూడి గ్రామంలో చిన్న వీధిలో ప్రధాన రహదారికి నిర్మించిన వీధి కాలువపై రాకపోకలకు ఆటంకాలు లేకుండా పలకల ఏర్పాటు చేశారు. కాలువపై పలకలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసిల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన జనసేన నాయకులు తమ సొంత నిధులతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా కాలువపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేసి పాడైపోయిన డ్రైనేజీ కాలువలను కూడా బాగు చేయించారు. వల్లంపూడి జనసేన నాయకుడు సేనాపతి నాయుడు, పైడినాయుడు ఆధ్వర్యంలో ఈ పనులు చేశారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాల స్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడ విద్యార్థులు స్కూల్ లెవెల్ కాంపిటేషన్‌లో ప్రతిభ కనబర్చారు. ఆదివారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్కూల్ లెవెల్ కాంపి టేషన్‌లో పదో తరగతి చదువుతున్న తాళ్ళపూడి రేణుక జూనియర్ విభాగంలో, సీనియర్ విభాగంలో ఎం. రూపశ్రీ విజేతలుగా నిలిచారు. వీరితో బాటు ద్వితీయ, తృతీయ స్థానం పొందిన వారికి హెచ్‌ఎం జ్ఞాన శంకర రావు చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిసిఎస్ కంపెనీ ఎస్‌పిఒ కె.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెగా అభిమానులు హేండ్స్ ఇన్ హేండ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సమక్షంలో కేక్ కట్ చేశారు. చిన్నారులు, యువకులు స్నేహితులు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని విశాఖ డైరీ పాల ఉత్పత్తి కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శంకర ఫౌండేషన్ నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 78 మందికి నేత్ర పరీక్షలు చేసి 48 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ చందన, కోఆర్డినేటర్ జోగారావు, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక మండల పరిధిలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణికి రొంపల్లి ఎంపిటిసి, టిడిపి నాయకుడు భవిరెడ్డి శంకరరావు తెలిపారు. ఆదివారం ఆమె స్వగృహంలో ముఖ్య నాయకులతో కలిసి శివరాంపురం బ్రిడ్జి పూర్తిచేసి రొంపల్లి మీదుగా బొబ్బిలికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని, జోగిందొరవలస గిరిజన భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని కోరారు. రొంపల్లి పంచాయతీలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆమెకు వివరించామన్నారు. ఆమె స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఈ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామరోతు రామారావు, తాడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను భయబ్రాంతులకు గురిచేయడం సరికాదు

మండల టిడిపి నాయకుల తీవ్ర అభ్యంతరం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రేగిడి

వైసిపి నాయకులు సర్వసభ్య సమావేశంలో అధికారులను భయభ్రాంతులకు గురిచేసి, హెచ్చరికలు జారీ చేయడం సరికాదని టిడిపి మండల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఉంగరాడ మెట్టవద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, టిడిపి మండల కమిటీ నాయకులు దూబ ధర్మారావు, పాలవలస రామచంద్ర నాయుడు, పాలూరి రామినాయుడు, ధనంజయరావు, దామోదర రావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యత గల అధికారులను ఇలా భయ భ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలకు విఘాతం కలుగుతాయని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా వైసిపి ప్రభుత్వ హయంలోనే ట్రాక్టర్లు, లారీలతో నాగావళి నదిని దోచేసి ప్రస్తుతం ఇసుక పై వారే మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. మండల పరిషత్ నిధుల వ్యయంలో వైసిపి చోటా నాయకులు గత మూడేళ్ల అవకతవకలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. దీనిపై బహిరంగ విచారణకు రావాలని సవాల్ విసిరారు. ప్రధానంగా మండల పరిషత్ ప్రాంగణంలో నీడను ఇచ్చే పదుల సంఖ్యలో ఉన్న టేకు చెట్లు, నిద్ర గన్నేరు చెట్లు ఇతర విలువైన చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికి అమ్మకాలు చేపట్టడంతో టిడిపి మండల కమిటీ అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వీటిపై విచారణ జరిపి నిజానిజాలు తేలే వరకు పోరాటం చేస్తామని వెల్లడించారు. సచివాలయ భవనాలకు కేటాయించిన సుమారు పదివేలు సిమెంట్ బస్తాలు స్థానిక వైసిపి నాయకులు పక్కదారి పట్టించడంతో పంచాయతీరాజ్ ఎఇ రామకృష్ణ ఆత్మహత్య చేసుకోలేదా అని ప్రశ్నించారు. దీనిపై సిబిసిఐడి విచారణకు తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన నివేధికలను బయటపెట్టి దోషులను శిక్షించాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

అభ్యుదయ విద్యాసంస్థల అధినేతకు మాతృవియోగం

ప్రజాశక్తి- బొబ్బిలి



మర్రాపు మహాలక్ష్మి (ఫైల్)

అభ్యుదయ విద్యా సంస్థల అధినేత మర్రాపు కూర్మి నాయుడు (నాని)కు మాతృ వియోగం జరిగింది. నాని తల్లి మర్రాపు మహాలక్ష్మి శనివారం రాత్రి మరణించారు. బొబ్బిలి ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యను అందించేందుకు మహాలక్ష్మి భర్త మర్రాపు సత్యనారాయణ అభ్యుదయ పాఠశాలను స్థాపించారు. ఆయన 2008లో మరణించారు. అప్పటి నుంచి పాఠశాల కరస్పాండెంట్ గా కుమారుడు మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపాల్ గా కోడలు చింతా శారద వ్యవహరిస్తున్నారు. మహాలక్ష్మి మరణించడంతో పట్టణ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- బొండపల్లి



పోటీలను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు సందర్భంగా మండల శాఖ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను బొండపల్లి పోలీసు స్టేషన్ వద్ద గల షటిల్ కోర్టులో ఆదివారం ప్రారంభించారు. ఉపాధ్యాయులకు నియోజకవర్గ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో వివిద పోటీలు నిర్వహిస్తున్నామని, గెలిపొందినవారిని జిల్లా స్థాయికి, అనంతరం రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విన్నర్స్ వీళ్లే

ఈ పోటీలలో మొత్తం 36 మంది ఉపాధ్యాయులు 18 జట్లుగా పాల్గొన్నారు. విన్నర్స్‌గా గురునాయుడు (గడసాం) టీమ్, రన్నర్స్‌గా శ్రీహరి టీమ్ (చౌదంతివలస), తృతీయ స్థానంలో జె.వెంకటరమణ (తాడెందొరవలస) టీమ్ విజేతలుగా నిలిచారు. విజేతలను యుటిఎఫ్ మండలశాఖ అభినందనలు తెలిపింది. ఈ నెల 10న దత్తిరాజేరు మండల మహాసభలో బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలకు రిఫరీగా మెంటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, జిల్లా సిపియస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం మండలాల నాయకులు సూరిబాబు, రమేష్, చంద్రరావు, జగదీష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించరా..?

ప్రజాశక్తి - వేపాడ



ఈ రోడ్డునే బాగుచేయాల్సి ఉంది..

వేపాడ సచివాలయ పరిధిలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు వసతిగృహం, కస్తూరిబా బాలికల వసతి గృహం, ఎపి మోడల్ స్కూల్ సముదాయానికి వెళ్లే రహదారిని నిర్మించాలని విద్యార్థులు కోరతున్నారు. గతంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వాతిరాణి రూ.1.80 కోట్ల నిధుల మంజూరు చేయడంతో సీసీ రోడ్లు నిర్మించారు. అయితే బక్కు నాయుడుపేట జంక్షన్ నుండి విద్యా సంస్థలకు వెళ్లే రోడ్డు కిలోమీటర్ లోపు ఉంటుంది. ఈ రోడ్డును మాత్రం వేయకుండా మెటలు, రోడ్డుకు అవసరమైన మెటీరియల్ సిద్ధం చేసి పనులు చేయకుండా నిలిపివేశారు. వర్షం వస్తే ఈ రోడ్డు పూర్తిగా బురదగా తయారీ పాఠశాలకు వెళ్లే బడి బస్సు పలుమార్లు కూరుకుపోయింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు. ఈ విషయంపై ఎంపిపి డి.సత్యవంతుడు దృష్టికి తీసుకుని వెళ్లినా పనులు ఇంకా ప్రతిపాదన స్థాయిలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం వర్షాలు పడటంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

జిఒ 117 రద్దు తర్వాతే పని సర్దుబాటు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు

పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేసిన, అనేక పాఠశాలలు మూసివేతకు, వేల పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చిన, ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117 జిఒను రద్దు చేసిన తరువాతే పని సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఎపిటిఎఫ్ వివిధ మండలాల ప్రతినిధులతో అత్యవసర సమావేశాన్ని గౌరవాధ్యక్షులు జోగినాయుడు నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి రాజు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ విద్యార్థులను ఉపాధ్యాయులను, తల్లితండ్రులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో 117వ జిఒను రద్దు చేస్తామని, అస్తవ్యస్థమైన విద్యారంగాన్ని గాడిన పెడతామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. తక్షణమే జిఒ రద్దు చేసి విద్యాశాఖలో నెలవారీ పదోన్నతులు ఇవ్వాలని ఆ తరువాతే పని సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిఒ రద్దు చేయకుండా పని సర్దుబాటుకు ఆదేశాలివ్వటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు చాలా మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని, ఉపాధ్యాయ ఖాళీలు ఇప్పటిలో భర్తీ చేసే అవకాశం కనిపించటం లేదని తక్షణమే పదోన్నతులు కల్పించి ఆ తరువాతే పని సర్దుబాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి. పద్మావతి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఏ మాధ్యమంలో పరీక్షలు రాయాలో ప్రభుత్వం స్పష్టత నివ్వాలన్నారు. తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాయటానికి అవకాశం కల్పించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ప్రవీణ్ కుమార్, ఎల్లయ్య, రామకృష్ణ, లక్ష్మణరావు, దర్శనం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వస్తువుగా రోగులు

ప్రజాశక్తి - కొత్తవలస



కృత్రిమ అవయవాలను అందిస్తున్న శర్మ, తదితరులు

కార్పొరేట్ ఆసుపత్రిలో రోగులను వ్యాపార వస్తువులుగా చూసి నిలువు దోపిడీ చేస్తున్నారని ఆంధ్రప్రభ చీఫ్ ఎడిటర్ వైయస్సార్ శర్మ అన్నారు. ఆదివారం సాయంత్రం గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ గురుదేవ్ ట్రస్టులో విభిన్న వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీతో పాటు వారి కోసం ఉన్నతమైన ఆసుపత్రిని నిర్మించి ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ముందుగా ట్రస్ట్‌ను హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం అంధులకు పింఛను, వృద్ధులకు రేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణింద్ర, హాస్య బ్రహ్మ శంకర్ నారాయణ, ట్రస్ట్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుంగిపోయిన గాలిపేట రహదారి

కుంగిన రహదారి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చాకివలస నుంచి గాలిపేట వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు పూర్తిగా కుంగిపోయింది. చెరువు పక్కనే ఉండటం, మట్టిని తవ్వేయడంతో కుంగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ రహదారిలో నుంచి ట్రాక్టర్లు, లారీలు వెళ్లేందుకు భయపడుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కొత్తవలసలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కొత్తవలస



రక్తదానం చేస్తున్న యువత

సంబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనకాల శివ అధ్యక్షతన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో కొత్తవలస శ్రీనివాస కళ్యాణ మండపంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 32 మంది ట్రస్ట్ సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కనకాల శివ మాట్లాడుతూ రక్తం అందక అనేకమంది తలసేమియా చిన్నారులు, గర్భిణులు, ప్రమాద బాధితులు సమస్యలకు లోనవుతున్నారని, వీరందరికీ సహకరించడానికే రక్తదానం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వై. శివ నాగేంద్ర రెడ్డి, సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మీసాల దుర్గాప్రసాద్, పి. శివరామకృష్ణ, చవితన మురళి, కర్రి చిన్న, బొల్లా ప్రగడ గిరిధర్, ఆర్టీసీ శర్మ, కొత్తవలస యువత పాల్గొన్నారు.

ఎరువూ కరువే..

ప్రజాశక్తి- మెరక ముడిదాం

రైతు భరోసా కేంద్రాలలో వ్యసాయ ఎరువులు అందక మండలంలోని రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ముమ్మురుగా పొలాలల్లో దమ్ములు పడుతున్న సమయంలో రైతులకు ఎరువులు కొరత ఏర్పడటం, అధికారులు దీనిపై దృష్టి సారించక పోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంట పొలాలల్లో దమ్ములు పడుతున్న వేల డిఎపి ఎరువులు చాలా అవసరం. వ్యవసాయాధికారులు మండలంలో ఏ రైతు భరోసా కేంద్రంలో కూడా రైతులకు అవసరమైన డిఎపి ఎరువుల నిలువపై దృష్టి పెట్టకపోవడంతో ఆందోళన వ్యక్త చేస్తున్నారు. యూరియా కొంతవరకు అందుబాటులో ఉన్నప్పటికీ, డిఎపి రైతులకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ షాపులలో డిఎపి ధర ఎక్కువగా ఉండటం వల్ల అక్కడకు వెళ్లి కొనే అవకాశం లేకపోవటం, పైగా రైతులకు వ్యవసాయానికి ముందు పంట పెట్టుబడి ప్రభుత్వం విడుదల చేయక పోవటం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు రైతులకు ప్రధానమైన డిఎపి ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.